# ఓ వనితా! నీ పేరున దశాబ్దమా!

— లక్ష్మి ఎమ్.ఎ

" బేగినియ్యవయ్యా కూలిరూకలు. పొద్దుగూకుతున్నది" రాములమ్మ ఆత్రుతగా అడిగింది.

"ఏంటే ఆ తొందర? ఒక్కొక్కరికీ ఇవ్వక్కర్లేదా? వరుసలో నిలబడు." కసురుకుంటూ ఒక్కొక్కరికీ డబ్బులు పంచుతున్నాడు గుమస్తా.

పొద్దున్నుండి మట్టిపోసి వళ్ళు తీపులు తీస్తున్నా యింటికెళ్ళి పిల్లలకు, మొగుడికి నూకలు కాచిపోయాలని పరుగు పరుగున గుడిసె చేరిందామె.

సందెవేళ....పిల్లలు మురికిలో పొర్లాడి అలసిపోయి కళ్ళల్లో వత్తులేసుకుని వాకిలిలో కూర్చుని యెదురు చూస్తున్నారు తల్లి కోసం.

అది చూసిన రాములమ్మకు గుండెల్లో యెవరో చేయిపెట్టి కెలికినట్టయింది. వళ్ళు తూలుతున్నా లెక్క చేయక గబగబ చుట్టూ తిరిగి నాలుగు పుల్లలేరుకుని పొయ్యి రాజేసి ముందుగా నీళ్ళు కాచి పిల్లలకు పోసింది. ఆకలితో నీరసించి వున్న వాళ్ళు వేడిగా నీళ్ళు పోయడంతో సొమ్మసిల్లి పడిపోయారు. దొంతులన్నీ తడిమి అడుగున రెండు దారలు నూకలుంటే తీసి పొయ్యి మీదేసింది.

నూకలు వుడుకుతున్నాయి. పొయ్యి దగ్గర కూర్చున రాములమ్మ మనసు–రంగడు యింకా రాలేదేమని ఆలోచిస్తూంది. ఈ పూటైనా రూకలు యింటికి తెస్తాడో లేదో అని ఆత్రపడుతూంది. రాత్రి ఒట్టేయించుకుంది. బిడ్డల పెమాణంగా తాగనన్నాడు. 'ఇక తాగడులే' అని మనస్సుకు నచ్చచెప్పుకుని నూకలు ఉడికితే దించేసింది.

పిల్లల్ని లేపి వారికి కడుపునిండా తాగించి పడుకోబెట్టింది. మిగిలింది మూతపెట్టి రంగడింకా రాలేదేమిటబ్బా అనుకుంటూ గడపలో కూర్చుంది.

" యేవే( ఒళ్ళు కొవ్వెక్కిందా? దోగందానిలా బయట కూకున్నావు" మొగుడి మాటలతో కళ్ళు మూతలు పడుతున్న రాములమ్మ ఉలికిపడుతూ లేచి నుంచుంది.

రంగడి నోటి నుంచి సారాయి వాసన వచ్చేసరికి యెక్కడలేని కోపం వచ్చేసింది. " నువ్వు మనిసివేనా? బిడ్డ మీద పెమాణం చేసి మళ్ళీ తాగొచ్చేవా? సచ్చినోడా, రెండు రూకలైనా యింట్లో యివ్వవ్. నీకు తిండెట్టా వస్తాది? యెల్లు" కోపంతో కాళి అయింది రాములమ్మ.

" ధు( లంజాముండా, రెండు రూకలు తెచ్చావని మిడిసి పడ్తున్నావా? నిన్నెవరెల్లమన్నారే కూలికి? రేపుటుండి గుడిసె కదులు. కాళ్ళిరగ్గొడ్తాను. నా యిట్టం. తాగుతాను. తందనాలాడుతాను. నువ్వు, నీ బిడ్డలు యేట్లోపడి సావండి" అంటూ జుట్టుపట్టి వంచి, గొడ్డును బాదినట్టు బాదుతున్నాడు రంగడు. అసలే నీరసంతో, కడుపులో బాధతో వున్న ఆమె ఈ దెబ్బలు ఓర్చుకోలేక పోయింది. ఆ అబలశరీరం సొమ్మసిల్లి పోయింది.

ఈడ్చి పక్కకు శవాన్ని తోసినట్టు తోసి కుండలపైపడి మిగిలివున్న గంజిని త్రాగుతున్నాడు రంగడు.

ఓ మరబొమ్మా! నీ పేరునా దశాబ్దం?

*

ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగు అన్నట్టు అట్టహాసంగా జరుగుతూంది పెండ్లి సంబరం. రంగురంగుల కరెంటు బల్బుల వెలుగులో దేవలోకమా అన్పించుతూంది పెళ్ళి పందిరి. పెండ్లికొడుకు విలాసంగా కూర్చుని అటు యిటు చూస్తున్నాడు.

" ఆ(, ముహూర్తం దగ్గర పడ్తూంది. పెండ్లికుమార్తెను తీసుకురండి" మంత్రాలు చదువుతూ అయ్యవారు అరుస్తున్నాడు.

పెండ్లికుమార్తె తల్లి వడివడిగా లోపలికెళ్ళి కూతురి స్నేహితురాళ్ళతో " అమ్మాయిని తీసుకు రండమ్మా" అంటూ బయట కొచ్చేసింది.

సుగుణ సిగ్గుగా స్నేహితురాళ్ళ ఛలోక్తులతో మెల్లగా వచ్చి వరుని ప్రక్క కూర్చుంది.

పెండ్లికొడుకు పసుపుతాడు చేతిలోనికి తీసుకుని పెండ్లికూతురి వైపు తిరిగాడు.

"ఆగండి" గంభీరంగా గర్జించిందొక స్వరం. మంత్రించినట్టు ఆగిపోయాడు వరుడు.

చటుక్కున తలెత్తి చూసింది సుగుణ.

"కట్నం తాలూకు మిగిలిన పదివేలూ తాంబూలంలో పెట్టి యిక్కడ పెట్టండి. ఆ తర్వాతే సూత్రధారణ." కరకుగా మ్రోగింది పెండ్లి కుమారుని తండ్రి కంఠం.

వధువు తండ్రి గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. ఏదైతే జరగకూడదనుకుంటున్నాడో ఆ ఉపద్రవం ముంచుకొచ్చింది. యెలాగో గొంతు పెగల్చుకుని " బావగారూ, తొందరపడకండి. సూత్రధారణ కానీయండి. పది రోజుల్లో పదివేలూ పువ్వుల్లోపెట్టి యిస్తాను. యిల్లు బేరానికి రాలేదు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని చాలా తక్కువ ధర కడుగుతున్నారు అందరూ. ఈ మారు యెంతైనా అమ్మి డబ్బిస్తాను. దానికోసం పెండ్లి ఆపుజేసి నా బిడ్డ గొంతుకోయకండి. మీరు కోరినట్టు వివాహం ఘనంగానే జరిపిస్తున్నాను. నా మీద నమ్మకం లేకపోతే ఇల్లు – యిప్పుడే మీ పేర రాసిస్తాను. దయచేసి వొప్పుకోండి." అంటూ చేతులు పట్టుకున్నాడు.

" ఇదేనయ్యా నీ పెద్దమనిషితనం? నిశ్చితార్థం రోజున ఈ రోజిస్తానన్నావు? ఈ రోజిలా అంటున్నావు. ఇక పది రోజుల తర్వాత మరో

నాటకం. బాగుంది భాగవతం. నాకింకేం పని లేనట్టు నీ యిల్లు రాయించుకోవాలా? యింకా నయం. సూత్రధారణ జరగలేదు. ఎంచక, ఎంచక యిలాంటి దరిద్ర సంబంధాన్నే యెంచుకున్నాం. కోటిమంది లక్షలిస్తామన్నా వాటిష్టపడ్డాడని ఊఁ అన్నాం—సరైన శాస్తి జరిగింది. యింకా అలా చూస్తావేం? అబ్బాయిని తీసుకుని బయలుదేరండి'' వాన కురిసినట్టు ఏకధారగా మాట్లాడుతూ భార్య వైపు ఉరిమి చూశాడు పెండ్లి కుమారుని తండ్రి.

"వదినగారూ! అన్నగారికి నచ్చ చెప్పండి. మీకూ కూతుళ్ళున్నారు. నా బిడ్డ ముఖం చూడండి. ఇప్పుడు మీరు వెళ్ళిపోతే దానికిక జన్మలో పెళ్ళి కాదు. నా బిడ్డ జీవితం నాశనం చేయకండి.'' అంటూ ఘోరున ఏడుస్తూ పెళ్ళికొడుకు తల్లి రెండు చేతులు పట్టుకుంది వధువు తల్లి.



ప్రేక్షకురాలిలా యిదంతా చూస్తున్న సుగుణ హృదయం అవమానాగ్నిలో భగ్గుమంది. అసహాయత కన్నీటి రూపంలో జారి భూమిలో యింకిపోతూంది.

"యింకా ఆలోచిస్తారేం. నడవండి.'' తండ్రి ఆజ్ఞకు శిరసావహించే శ్రీరామచంద్రునిలా పసుపుతాడు వదిలేసి అలాగే నడిచాడు తండ్రి వెనుక అతను.

గంటక్రితం ఇంద్రలోకంలా వున్న పెండ్లి పందిరి యిప్పుడు శ్మశాన వాటికలా అయింది. తల్లి, తండ్రి తన దురదృష్టానికి కుళ్ళి కుళ్ళి యేడుస్తున్నా, తన మనసులో చెలరేగుతున్న సుడిగుండాలను పైకి పొంగనీయక, సుగుణ చలించక రాయిలాగా అలాగే కూర్చుండిపోయింది.

ఓ భగ్న హృదయినీ! నీ పేరునా దశాబ్దం??

*

పెండ్లినాటి చీరకట్టి, తలనిండా పూలు, పసుపు కుంకుమ, మోచేతుల వరకూ గాజులూ తొడిగి అలంకరించారు శారదను.

యేడ్చి యేడ్చి అలసిపోయిన శారద తనని కాదన్నట్టు మౌనంగా వుండిపోయింది. బలవంతంగా లేపి అందరూ కలసి ఆ వూరి చెరువు దగ్గరకు తీసుకెళ్తున్నారు ఆమెను.

కంట్లో ఒక చుక్కైనా నీరు రావడం లేదు.

"శారదా! నీవెంత నష్టజాతకురాలివే? ఇంత చిన్న వయసులో పసుపు కుంకుమ దూరం చేసుకోవలసి వచ్చింది.''

"మళ్ళీ యెప్పుడేసుకుంటావ్. చేతినిండా గాజు లేసుకో.''

"శారదా! యిదిగోనే మా దొడ్లో పూసిన మల్లెలు. మళ్ళీ పెట్టుకునే అదృష్టం లేదు గా. పెట్టుకో.''

"దాని ముఖాన మరింత పెద్ద బొట్టు పెట్టండి. ఈ రోజేగా.''

భర్త చనిపోయాడని ఓదార్చడానికొచ్చిన తోటి స్త్రీల మాటలు రంపపుకోతల్లా-నిజం చెప్పాలంటే భర్త చావుకన్నా యెక్కువ బాధించాయి.

తన దైవం, తన ప్రాణం పోయి తాను యేడుస్తుంటే. ఈ అలంకారాలన్నీ చేసి ఈ పదకొండు

రోజులూ దిష్టిబొమ్మను చేశారు. యిప్పుడు జరగబోయేదేంటి? ఆ తలంపుతో ఒళ్ళంతా ఒణుకు పుట్టడంతో అలాగే కళ్ళుమూసుకుని తూలిపడబోయింది శారద.

అలాగే ఆమెను పట్టుకొచ్చి చెరువుగట్టు మీద కూర్చోబెట్టి పూలన్నీ తీసేశారు. చేతులనిండా వేసినవారే నిర్భయంగా గాజులన్నీ ఫెళఫెళ పగులగొట్టారు. అందంగా తీర్చి దిద్దిన చేతులతోనే కుంకుమను తుడిచేశారు.

"లేదు. లేదు. నేను భరించలేను. వద్దు. దీని కన్నా నన్ను చంపేయండి. హాయిగా వుంటుంది." హృదయ విదారకంగా యేడుస్తూంది శారద.

ఇకమీదట తను నిద్రలేస్తూనే యెవరికీ కనబడకూడదు. పెండ్లి జరుగుతున్నా అక్షతలు వేయకూడదు. "అమ్మాయ్, శారదా! ఓమారిలా యెదురు రామ్మా. పని సవ్యంగా జరుగుతుంద"ని యెక్కడున్నా తనని పిలిచే మామయ్య "ఛీ, దరిద్రురాలా. ఎదురొచ్చావూ? ఇక పని అయినట్టే" అంటూ పొరపాటున యెదురొచ్చిన తనని చూసి మళ్ళీ లోపలికెళ్తాడు మామయ్య.

"మా కోడలు లక్ష్మీదేవి. అది నట్టింట వుంటేనే చాలు." అని మురిసిపోయే అత్తగారు తన ముఖం చూస్తూనే "దరిద్రపు దానా, నిన్ను కట్టుకున్నందుకేగా నా బిడ్డ చనిపోయాడు" అని చీదరించుకుంటుంది.

భవిష్యత్తులో తన స్థానాన్ని తలచుకుని కుమిలి కుమిలి రోదిస్తూంది శారద — అక్కడే చెరువు దగ్గరే కూర్చుని.

ఓ బలిపశువా? నీ పేరునా దశాబ్దం???

*

సాయంకాల సమయం. సంధ్య వెలుగులు మెల్లమెల్లగా జారుకుంటున్నాయి. చీకటి అల్లనల్లన అంతటా పరచుకుంటూ వుంది. ఆ పట్టణానికంతా యిరుకైన వీధి అది. రోడ్డు మీదే పారే మురికి కాలువలు, చెత్త చెదారాలు, అడుగు పెడితే పాప పంకిలమవుతుందేమోనన్నంత అసహ్యంగా వుంది. ఆ వీధిలో ఇంటింట వాకిటా ఓ అంగన నిలబడి వుంది. ఉడిగిపోయే వయసు-అందాల్ని, వంపుల్ని కరిగిస్తున్నా అలంకారాల్తో దాన్ని కప్పి పుచ్చుకుంటూ పొట్టకూటికి గడుపుకుంటున్నారు వారు. మామూలుగా రోజూ బేరం కుదిర్చి తీసుకొచ్చే రిక్షా గణగణమంటూ ఒక వాకిలి ముందు ఆగింది. అందులోనుండి ఓ వ్యక్తి దిగాడు. యెవరికైనా కనపడితే నేరం అన్నట్టు తొందరగా లోపలికెళ్ళాడు. ఈనాటి భాగ్యం అనుకుంటూ ఆమె వెంటనే తలుపేసేసింది.

అదే సమయంలో యెదురింట్లో తలుపు తెరుచుకుంది. వడలిన కాడలా వుందామె. అతనితోపాటే వాకిలిలో కొచ్చి అతనిచ్చిన కట్టలు లెక్కపెట్టుకోకనే జాకెట్లో దోపేసి వాకిలిదాకా వచ్చి సాగనంపింది ఆనాటి ప్రియుణ్ణి.

మరో యింట్లో "వీల్లేదు, ఈ రోజు నీవే వెళ్ళాలి. నేను మాటిచ్చేసి అడ్వాన్సు కూడా తీసుకున్నాను. తలనొప్పికే రెస్టు కావాలా? తొందరగా వెళ్ళి 'రెడీకా. అతనొచ్చే వేళయింది. వెళ్ళు." ఆ కంపెనీ హెడ్ మాటలకు బదులు చెప్పలేక తల బాధతో ఒళ్ళు తూలిపోతున్నా ఒక కామాంధుడి దాహాన్ని తీర్చడానికి తయారయింది ఓ అబల.

విధి వంచితులారా! మీ పేరునా దశాబ్దం????

### సమయస్ఫూర్తి

వసంత జిడ్డులా పట్టుకుంటే వదలదని అందుకని ఆమెకు కనిపించాలంటేనే— ఫ్రెండ్సందరికీ తగని భయం. ఒక రోజు వసంత తమ ఇంటికి రావడం కళ్యాణి దూరం నుండే చూచి. త్వరత్వరగా తల్లి దగ్గరకు వచ్చి "ఆ జిడ్డు వస్తోంది నేను లేనని చెప్పమ్మా" అని చెప్పి మేడపై కెళ్ళి కూచుంది. కళ్యాణి లేదని చెప్పినా వెళ్ళకుండా వాళ్ళమ్మ. బొమ్మలను ఓ గంటసేపు బోర్ కొట్టించి కాని లేవలేదు వసంత. పనివేళలో వసంతను పొమ్మని చెప్పలేక సతమతమయ్యారు వాళ్ళు.

ఇంతలో కళ్యాణి పైనుండి "అమ్మా! ఆ శని జిడ్డు వెళ్ళింది కదా?" అంటూ ఓ కేక పెట్టింది. ఆ మాట వసంత విన్నది! అయితే — వాళ్ళమ్మగారేమీ కంగారు పడకుండా "ఆ....ఆ శని వెళ్ళిందమ్మా. ఇప్పుడు వచ్చి మాట్లాడుతుందేది మీ ఫ్రెండు వసంత" అని సమయస్ఫూర్తిగా జవాబిచ్చింది!

విజయలత

# కనక్ రెలే

భాషాభేదాలు కాని ప్రాంతీయ ఎల్లలు గాని కళకు అడ్డురావు. వీటినన్నిటినీ అధిగమించే శక్తి కళకు వుంది-అంటారు విజ్ఞులు. ఈ మాటకు అర్థంగా, ప్రత్యక్ష తార్కాణంగా చెప్పదగిన వనిత— డాక్టర్ కనక్ రేలె.

నలందా నాట్య పరిశోధనా కేంద్రానికి డైరక్టర్‌గా వుంటూ నాట్యకళకు ఇతోధికమైన సేవలు చేస్తున్న శ్రీమతి కనక్ రేలె పుట్టింది గుజరాత్‌లో. పెళ్ళాడింది ఒక మహారాష్ట్రుని. దక్షిణభారత దేశంలోని కేరళ ప్రాంతానికి చెందిన కథకళి నాట్యం పట్ల అభిరుచి కనబరచి, అందులో శిక్షణ పొంది— ఆ కళలో నిష్ణాతురాలు అన్న ప్రశంస కూడా పొందారామె.

పేరుమాసి రూపుమారి కొన ఊపిరితో అవసాన దశను చేరుకుంటున్న కథకళి నృత్యానికి, ముఖ్యంగా 'మోహిని ఆట్టం' అనే నాట్య ప్రక్రియకు—తన నిర్విరామ కృషితో, దీక్షాదక్షతలతో, పునర్జన్మ ప్రసాదించి పెద్ద పీట వేయించిన ఘనత శ్రీమతి

